సాక్షి
కుమురం భీం

శనివారం ı 11 ı మార్చి ı 2023



సందర్శించి.. తెలుసుకుని
ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారులు ఈ నెల 4 నుంచి శుక్రవారం వరకు నిర్మల్ జిల్లాలో పర్యటించారు. సంక్షేమం పథకాల అమలు, గ్రామీణుల జీవన విధానం గురించి తెలుసుకున్నారు. 8లో▸



'పంట మార్పిడి'తో ప్రయోజనం
ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో తెగుళ్ల ఉధృతితో దిగుబడులు తగ్గుతున్నాయి. పంట మార్పిడి విధానంలో లాభాలు సాధించవచ్చు. 9లో▸



గరిష్టం/కనిష్టం
35.5/19.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు భానుడి ప్రతాపం కొనసాగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. చలి ప్రభావం పెద్దగా ఉండదు.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌వో కార్యాలయం తనిఖీ



డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ శాఖ ద్వారా నిర్వహించే సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. డీసీహెచ్ డాక్టర్ స్వామి, వైద్యసిబ్బంది ఉన్నారు.

రేపు సత్యసాయి సేవాసదన్ వార్షికోత్సవం
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని భగవాన్ సత్య సాయి సేవాసదన్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఓంకారం, సాయి సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, హారతి కర్పూర హోమం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నారాయణ సేవ, సాయంత్రం 7 గంటలకు సామూహిక భజన, మహామంగళ హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పేదలకు అండగా ప్రభుత్వం



చెక్కు అందిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలోని పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో లబ్ధిదారులకు ఆయన శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మౌల్కర్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు పరిహారం అందేలా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజేశ్వర్

రెబ్బెన(ఆసిఫాబాద్): నేషనల్ హైవే విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. ఇటీవల నిర్వహించిన జెడ్పీ సమావేశంలో జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన కొంత మందికి ఇప్పటివరకు పరిహారం అందలేదని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఇన్‌చార్జి ఆర్డీవో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పరిహారం అందని నిర్వాసితులకు వెంటనే చెల్లించేలా చూడాలని తహసీల్దార్ మల్లికార్జున్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు పరిహారం అందని కొంత మంది వివరాలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, నాయకులు బొమ్మినేని శ్రీధర్ పాల్గొన్నారు.

బాలింత మృతి
కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామానికి చెందిన అల్గం మానస (21) అనే బాలింత శుక్రవారం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం కాగజ్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో సాధారణ ప్రసవం ద్వారా పాపకు జన్మనిచ్చింది. శుక్రవారం మానస ఆరోగ్యం విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మానస మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



గ్రామ శివారులోని చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్న పాటగూడ గ్రామస్తులు

చేతిపంపు వద్ద గుమిగూడిన మహిళలు

నిరుపయోగంగా భగీరథ నల్లా

మురుగునీటిని తాగుతున్న పశువులు

పల్లె గొంతెండుతోంది!

ఎండలు ముదరక ముందే ఏజెన్సీ గ్రామాలు తాగునీటికి తండ్లాడుతున్నాయి. సర్కారు నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో ఆదివాసీ పల్లెల గొంతెండుతోంది. ఏటా ఎండాకాలంలో ఇదే పరిస్థితి ఉంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం సైతం అలంకారప్రాయంగా మారింది. భూగర్భ జలాలు కూడా అడుగంటుతుండటంతో దిక్కుతోచని స్థితిలో గిరిజనులు కొట్టుమిట్టాడుతున్నారు.

- కెరమెరి మండలం పాటగూడ, చాల్‌బడిలో తాగునీటి కష్టాలు
- నిరుపయోగంగా మిషన్ భగీరథ ట్యాంకు
- చేతి పంపు నీటితో కాలం వెల్లదీస్తున్న ఆదివాసీలు
- భూగర్భ జలాలు అడుగంటడంతో తీవ్ర అవస్థలు

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలోని కెరమెరి, జైనూర్, లింగాపూర్, తిర్యాణి మండలాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆయా ప్రాంతాల్లో గిరిజనులు అధికంగా నివసిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఏటా తాగునీటికి అవస్థలు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏళ్ల క్రితం వేసిన బోర్లు వేసవిలో చుక్కనీరు లేక అడుగంటిపోతున్నాయి. గ్రామాల్లో భగీరథ ట్యాంకులు నిర్మించి నల్లాలు ఏర్పాటు చేసినా ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. తాగేందుకు నీళ్లు లేక మూగజీవాలు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పాటగూడలో చేతిపంపులే ఆధారం..

కెరమెరి మండలం బాబేఝరి గ్రామ పంచాయతీలోని పాటగూడ మండల కేంద్రానికి కేవలం 19 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ 45 ఆదివాసీ కుటుంబాలు ఉండగా, 208 మంది జనాభా ఉంది. గ్రామంలో రెండు చేతి పంపులున్నా ప్రస్తుతం ఒక్కటే పనిచేస్తోంది. మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు అడుగంటి ఇందులో కూడా నీరు ఇంకిపోతుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. 2019లో గ్రామంలో రూ.12 లక్షల నిధులతో మిషన్ భగీరథ పథకం కింద మంచినీటి ట్యాంకు నిర్మించారు. ప్రతీ ఇంటికి నల్లాలు కూడా బిగించారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో నాలుగేళ్లుగా ట్యాంకు నుంచి చుక్క నీరందలేదు. గ్రామ శివారులో ఉన్న చేతిపంపునకు మోటారు బిగించారు. కొద్దిదూరంలో సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసి కనెక్షన్ సైతం ఇచ్చారు. అయితే మోటార్ వాడితే వచ్చే కొద్దినీళ్లు కూడా వృథా అవుతాయని ఆదివాసీలు చేతులతోనే బోరింగ్ కొట్టుకుని బిందెలు నింపుకుంటున్నారు. నీటి కోసం రాత్రి మూడు గంటల నుంచే మహిళలు చేతిపంపు వద్ద గుమిగూడుతున్నారు. మధ్యాహ్నం 12 దాటినా నీటి కోసం మహిళలు అక్కడే నిరీక్షిస్తూ కనిపిస్తారు. గ్రామంలోని మూగజీవాలకు కూడా ఈ చేతిపంపు నీరే ఆధారం. పశువులు అక్కడే మురుగునీటిని తాగి గొంతు తడుపుకుంటున్నాయి. తాగేందుకు నీళ్లు లేక ఐదేళ్లలో ఏడు పశువులు మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో 500 ఫీట్లతో మరో బోరు వేసి భగీరథ ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చాల్‌బాడిలో అడుగంటిన భూగర్భజలం

కెరమెరి మండలంలోని చాల్‌బాడి గ్రామంలో ఏడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ 40 మంది నివాసం ఉంటున్నా ఒక్క చేతిపంపు కూడా లేదు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు వారం క్రితం చెడిపోయింది. ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమీటర్ దూరంలో ఉన్న చేతిపంపు నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలోనే చేతిపంపు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బోరు చెడిపోతే తిప్పలే..



గ్రామంలో ఉన్న ఏకైక బోరు చెడిపోతే మేము తిప్పలు పడాల్సిందే. పిల్లలతో కలిసి గుట్ట కిందికి నీళ్ల కోసం రావాల్సి వస్తోంది. అంతదూరం నుంచి నీళ్లు తెచ్చుకోవాలంటే కష్టంగా ఉంది. గ్రామంలోనే మరో బోరు వేసి ట్యాంకు నింపాలి.
– ముత్తుబాయి, పాటగూడ

అధికారులు స్పందించాలి



ఏజెన్సీలో తాగునీటి సమస్యపై అధికారులు స్పందించాలి. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి. మరికొద్ది రోజులైతే ఉన్న చేతిపంపులో కూడా నీళ్లు రావు. అప్పుడు మేం ఎక్కడికి పోవాలి. బోరులో మరో రెండు పైపులు వేయాలి.
– ఆత్రం పగ్గు, పాటగూడ గ్రామ పటేల్

చేతిపంపు ఏర్పాటు చేయాలి



భూగర్భ జలాలు ఇంకిపోతుండటంతో మరో నాలుగు రోజులకు ఉన్న బోరు కూడా ఎండిపోతుంది. మాకు నీళ్లు కావాలంటే కిలోమీటర్ దూరంలో ఉన్న బోరింగ్ వద్దకు వెళ్లాలి. అధికారులు స్పందించి గ్రామంలో నూతనంగా చేతిపంపు ఏర్పాటు చేయాలి.
– కొరెంగ గోవింద్‌రావు, చాల్‌బాడి

ప్రతిపాదనలు పంపాం



ఇప్పటికే పాటగూడ గ్రామాన్ని సందర్శించి, అక్కడి నీటి సమస్యను తెలుసుకున్నాం. మరో బోరు ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే బోరు వేసి, ట్యాంకును నీటితో నింపుతాం.
– విశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కెరమెరి

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈవో శ్రీధర్ సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో పోలీసు, రెవెన్యూ, వైద్య ఇతర శాఖల సహకారంతో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 9,933 మంది ఇంటర్ విద్యార్థులు ఉండగా, అందులో జనరల్ విద్యార్థులు 8,457 మంది, ఒకేషనల్ 1,476 మంది ఉన్నారని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 5,135 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,798 మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, వీటిలో ప్రభుత్వ 11, ప్రైవేట్ 6 కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యులు శంకర్, తిరుపతి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న వీఏఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె దిగుతున్నట్లు జిల్లా కేంద్రంలోని డీఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు ఐకేపీ వీఓఏలు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నిర్వహించే సమ్మెలో జిల్లాలోని వీఓఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు సునీత, రమ, ఆనంద్, శ్రీనివాస్, సంతోష్, విజయ్‌కుమార్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే


ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 39 పరీక్ష కేంద్రాల్లో 6,670 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,048 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వెల్లడించారు. స్ట్రాంగ్ రూం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు భద్రపర్చే గది వద్ద రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆసిఫాబాద్: వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు గర్భిణులకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, పోషకాహారం అందించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

రేపు జిల్లాకు బీజేపీ సంస్థాగత కార్యదర్శి రాక

- జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత కార్యదర్శి అరవింద్ మీనన్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బూత్ స్వశక్తి కరణ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌తోపాటు పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి అల్లపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు హాజరవుతారని అన్నారు. జిల్లాలోని కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దోని శ్రీశైలం, చెర్ల మురళీధర్, విశాల్ ఖాండ్రే, మాటూరి జయరాం, ఈదులవాడ గణేశ్ పాల్గొన్నారు.

చలాన్ల భారం



జిల్లా కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి గుండ విశాల్‌కు టీఎస్ 01 ఈఈ 0160 నంబర్‌తో బైక్ ఉంది. నిర్మల్‌కు చెందిన ఓ వ్యక్తి ఇదే నంబర్‌తో తిరుగుతున్నాడు. పోలీసులు ఈ బైక్‌కు ఇప్పటివరకు 12 చలానాలకు రూ.4,700 జరిమానా విధించారు. వీటిలో కేవలం రెండు మాత్రమే విశాల్‌కు చెందినవి కాగా, మిగిలిన 10 నిర్మల్ జిల్లాలో డుప్లికేట్ నంబర్ ప్లేట్‌తో పడినవే. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధితుడు వాపోతున్నాడు. ఇలా తప్పుడు చలాన్లు, అధిక జరిమానాలతో వాహనదారులు బండి బయటికి తీయాలంటేనే భయపడుతున్నారు.

- పెరుగుతున్న పెండింగ్ చలాన్లు
- మూడేళ్లలో 2,29,456 వాహనాలకు రూ.6,01,59,235 జరిమానాలు
- ఆర్థిక భారంతో సతమతమవుతున్న వాహనదారులు
- తప్పుడు చలాన్లతోనూ తప్పని తిప్పలు



జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

జిల్లాలో మూడేళ్లలో నమోదైన కేసులు, జరిమానాలు

సంవత్సరం	నమోదైన కేసులు	విధించిన జరిమానాలు	పెండింగ్ జరిమానాలు
2021	91,902	రూ.3,27,12,310	రూ.1,47,87,350
2022	1,19,422	రూ.2,41,35,265	రూ.1,80,86,095
2023	18,132	రూ.33,11,660	రూ.31,47,790

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ మున్సిపాలిటీతోపాటు అన్ని మండల కేంద్రాల్లో నిత్యం పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకపోవడం, సరైన వాహన పత్రాలు లేకపోవడం.. ఇలా నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీగా జరిమానా విధిస్తున్నారు. కొంత మంది ఎప్పటికప్పుడు జరిమానాలు చెల్లిస్తుండగా, మరి కొంత మంది వివిధ కారణాలతో చెల్లించడం లేదు. దీంతో ఒక్కొక్కరికి రూ.వేలల్లో చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది పోలీసు శాఖ చలాన్లు చెల్లించేందుకు రాయితీ ప్రకటించడంతో కొంత మంది బకాయిలు చెల్లించారు. మూడు రోజుల క్రితం నల్గొండ జిల్లాలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ఓ వాహనదారుడు పెండింగ్ చలానాలు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తప్పుడు చలానాలతో జిల్లాలోని పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

మూడేళ్లలో రూ.6,01,59,235

మూడేళ్లలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 2,29,456 వాహనాలకు రూ.6,01,59,235 జరిమానా విధించారు. వీటిలో ఇప్పటివరకు 1,53,614 మంది వాహనదారులు రూ.2,33,57,545 చెల్లించగా, 1,41,639 మంది రూ.3,60,21,235 చెల్లించాల్సి ఉంది. జిల్లాలో వాహనాలకు రూ.కోట్లతో చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ముమ్మర తనిఖీలు

జిల్లాలో ప్రతిరోజూ ప్రధాన రహదారిపై నిత్యం పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌక్, జన్కాపూర్, ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్, రెబ్బెన, కాగజ్‌నగర్‌లో ముమ్మర తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పెండింగ్ చలాన్లు ఉంటే డబ్బులు చెల్లించాల్సిందే, లేదంటే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఈ– చలాన్ ద్వారా జరిమానా విధిస్తున్నారు. దీంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఈ– చలాన్ బై ఆటోమెటిక్ కెమెరాస్ ద్వారా కూడా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమాన పడుతోంది. ఓవర్‌స్పీడ్‌కు రూ.1,035, బైక్ జిగ్‌జాగ్ డ్రైవింగ్‌కు రూ.235, రాంగ్‌పార్కింగ్ రూ.100 జరిమానా విధిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వాహనంపై రూ.వేలల్లో పెండింగ్ చలాన్లు ఉండడంతో వాహనదారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు.

నిబంధనలకు తూట్లు

జిల్లాలో చాలా మంది వాహనదారులు అవగాహన లేక నిబంధనలు పాటించడం లేదు. రాష్ డ్రైవింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడపడం లాంటి చర్యలు పాల్పడుతున్నారు. వాహనాల నంబర్ ప్లేట్లు కనిపించకుండా మరకలు పూయడంతోపాటు కొంత మంది పూర్తిగా నంబర్ ప్లేట్లు తొలగిస్తున్నారు. అలాంటి వాహనాలు పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ కొంత మంది ఆకతాయిల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా పోలీసు శాఖ అధికారులు ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు

సిర్పూర్(టి): లోనవెల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఇదే గ్రామానికి చెందిన అవ నీధర్‌గౌడ్‌పై ఎలుగుబంటి దాడి చేయగా గాయపడ్డాడు. ఆ తర్వాత ఎలుగుబంటి పారిగాం గ్రామం వైపు వెళ్లగా ఆ గ్రామస్తులు తరిమికొట్టారు. దీంతో అది టోంకిని గ్రామం వైపు వెళ్లింది. ఈ గ్రామ సమీపంలో ఇదే గ్రామానికి చెందిన చౌదరి భువనేశ్వర్‌పై దాడి చేసి గాయపర్చింది. గాయపడ్డవారిని వారి కుటుంబ సభ్యులు సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాంకు లేఖ రాసినట్లు బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాల్లో అనుభవజ్ఞులైన స్పెషలిస్టులను నియమించాలని, క్వాలిటీ స్టాండర్డ్ మెడిసిన్ అందుబాటులో ఉంచాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

మెడికల్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

నస్పూర్: సింగరేణిలో పని చేస్తూ పదో వేజ్ బోర్డు పరిధిలో 01.07.2016 తర్వాత రిటైర్డ యిన, మెడికల్ అన్‌ఫిట్, మరణించిన ఉద్యోగులు ఈ సంవత్సరం మార్చి 31లోపు మెడికల్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో కోరింది. పూర్తి వివరాలకు కార్మికులు విధులు నిర్వర్తించిన ఆయా గనుల సంక్షేమాధికారులను సంప్రదించాలని సూచించింది.

బ్యాలవివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు



కొండపల్లిలో మాట్లాడుతున్న మహేశ్

పెంచికల్‌పేట్: బాల్యవివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) మహేశ్ హెచ్చరించారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో బాల్య వివాహాలు చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో శుక్రవారం బాలిక కుటుంబ సభ్యులకు బాలికల సంరక్షణ అధికారులు ఐసీడీఎస్ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా పెద్దలు, పూజారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్యవివాహాలు జరిగితే 1098కి సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సంజీవ్, ఎస్సై విజయ్‌కుమార్, శ్రీమతి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

సందర్శించి.. తెలుసుకుని

పార్‌పెల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు



● ముగిసినట్రైనీ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన ● ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యక్ష పరిశీలన ● 'సాక్షి'తో మనోగతం వెల్లడి

లక్ష్మణచాంద: వారంతా ట్రైనీ అధికారులు.. వీరిలో ఒకరు శిక్షణ ఐఈఎస్ కాగా, నలుగురు శిక్షణ ఐఎస్ఎస్ ఆఫీసర్లు. ఈ నెల 4వ తేదీ నుంచి నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, కుభీర్ మండలాలను సందర్శించారు. ఇందులో ఐదుగురు లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామానికి వచ్చారు. శిక్షణలో భాగంగా వీరు ఆరురోజులుగా గ్రామంలోనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రధాన వృత్తులు, సాగు చేస్తున్న పంటలు, సాగునీటి వసతి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం పర్యటన ముగించుకున్నారు. ఈ సందర్భంగా వారిని 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు వెల్లడించారు.

అవకాశం వస్తే తెలంగాణలో పని చేసేందుకు సిద్ధం



మాది ఉత్తరప్రదేశ్. తండ్రి సంత్‌కుమార్ సింగ్, తల్లి సావిత్రీదేవి. మాది మధ్యతరగతి కుటుంబం. తండ్రి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ నన్ను చదివించారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. తండ్రి పడుతున్న కష్టం నేరుగా చూసి ఎలాగైనా మంచి ఉద్యోగం సాధించాలనే తపనతోనే ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. అదే పట్టుదలతో చదివి 2020లో ఐఎస్ఎస్ 15 ర్యాంక్‌తో సాధించాను. నేడు ఐఎస్ఎస్ ట్రైనింగ్ కోసం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ పథకాలు, ప్రజల మంచి తనం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. నాకు తెలంగాణలో అవకాశం వస్తే తప్పకుండా పని చేస్తా.

– రాహుల్ సింగ్, ట్రైనీ ఐఎస్ఎస్ అధికారి

లక్ష్యం ముందే నిర్ణయించుకోవాలి



మాది ఢిల్లీ. నాన్న రాజేంద్రకుమార్, అమ్మ ఇంద్ర. నాన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగి, అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి ఇష్టంతో చదివేదాన్ని. పాఠశాల స్థాయి నుంచి పీజీ స్థాయి వరకూ మొత్తం ఫ్రీగానే చదివాను. ఎంఏ ఎకనామిక్స్ ఢిల్లీలో చేశాను. సరైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు. పీజీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు మొదటి సారి గ్రూపు పరీక్ష రాశాను కానీ రాలేదు. రెండో సారి పట్టుదలతో చదివి 2023 ఐఈఎస్‌లో 16వ ర్యాంక్ సాధించాను. – షెఫాలీ, ట్రైనీ అధికారి

అన్ని రంగాల్లో అభివృద్ధి



కడెం: శిక్షణలో భాగంగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ పర్యటించాం. ఈ గ్రామంలో పరిశుభ్రత, ఇంకుడుగుంతల నిర్మాణాలు, పాఠశాల, బ్యాంక్ సేవలందించేందుకు కస్టమర్ సర్వీస్ పాయింట్ ఉన్నాయి. చక్కని పాలన అందించే పాలకవర్గం ఉంది. వ్యవసాయ ఆధారిత గ్రామంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

– ఆలీషాఖానం, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

పథకాల అమలు తీరు

ప్రజాసంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్తున్నాయా? లేదా? అనే అంశాల గురించి తెలుసుకునేందుకు నేరుగా ప్రజలతో మాట్లాడారు. పథకాల ఫలాలు అర్హులకు అందుతున్న తీరును ప్రజల ద్వారా తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు గల మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామానికి గల రోడ్డు సౌకర్యం, గ్రామంలోని ఓపెన్ జిమ్, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, డంప్‌యార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో సాగు చేస్తున్న పంటల వివరాలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు.



పార్‌పెల్లిలో ట్రైనీ అధికారులు

పట్టుదలతో చదివి సాధించా



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. నాన్న వాసుదేవ్ సింగ్, అమ్మ నీలమ్ సింగ్. నాన్న ఓ ప్రైవేట్ ఉద్యోగి. చిన్నతనం నుంచి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చేశాను. పట్టుదలతో చదివి చివరకు 2022లో ఐఎస్ఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించాను. ఇక్కడ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు సరైన లక్ష్యంతో ముందుకుసాగడం లేదు. పదో తరగతిలోనే లక్ష్యం నిర్దేశించుకునేలా కెరీర్ గైడెన్స్ ఏర్పాటు చేయాలి. – వీణాసింగ్, ట్రైనీ అధికారి

పల్లె వాతావరణం నచ్చింది



మాది ఉత్తరఖండ్ రాష్ట్రం. మా నాన్న జీవన్ చంద్రజోషి, అమ్మ లీలాజోషి. నాన్న ప్రైవేట్ ఉద్యోగి. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. మాది మధ్య తరగతి కుటుంబం. కష్టాలు దాటుకుంటూ లక్ష్యం కోసం చదివి చివరకు 2020లో ఐఎస్ఎస్ ఐదో ర్యాంక్ సాధించాను. ఇక్కడి పల్లె వాతావరణం చాలా నచ్చింది. పాఠశాలలో సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ విద్యతో పాటు ఆంగ్లంపై పట్టు సాధించేలా చర్యలు చేపడితే ఉపయోగం.

– భావనాజోషి, ట్రైనీ అధికారి

కష్టాలను జయించి..



మాది ఢిల్లీ. మా నాన్న బాబులాల్ మీన్, అమ్మ రామ్‌పతి మీనన్. నాన్న ప్రైవేట్ ఉద్యోగి కావడంతో మా చదువుల కోసం అతడు అనేక కష్టాలు పడ్డారు. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పీజీ చేశాను. కష్టాలను అధిగమించి చదువులపై దృష్టి సారించి 2021లో 45వ ర్యాంక్ సాధించాను. సాధించాలనే తపన ఉంటే కష్టాలు అడ్డుకావు.

– గోవర్ధన్ మీనన్, ట్రైనీ అధికారి

నీటి విలువ గురించి తెలియజేశాం



కడెం: నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఆరురోజుల పాటు పర్యటించాం. గ్రామంలో అన్ని వసతులు బాగున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం నల్లా నీటిని అందించడం బాగుంది. కానీ.. చాలా వరకు ఇళ్లలో ఆన్.. ఆఫ్ బిగించనందున నీరు వృథాగా పోతోంది. గ్రామస్తులు నీటి వృథాను అరికట్టాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి

– సందీపన్ సర్కార్, ఇండియాన్ స్టాటిస్టికల్ సర్వీస్

గ్రామీణ జీవన విధానం బాగుంది



ఖానాపూర్: మండలంలోని మారుమూల గ్రామమైన ఎర్వచింతల్ ప్రజల జీవన విధానం బాగుంది. అత్యధిక మంది ఈ గ్రామంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ఈ ప్రాంతం ఎగువభాగం కావడంతో బ్యాక్‌వాటర్‌లో ఎంతోమంది చేపలు పట్టి జీవనాన్ని సాగిస్తున్నారు. చేపలు విక్రయించేందుకు వీరికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తే వీరి జీవనం మరింత సాఫీగా ఉంటుంది.

– శిఖ, ట్రైనీ అధికారిణి

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాం



ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు ఆరురోజులపాటు శిక్షణ తీసుకున్నాం. ఇక్కడ స్థానిక అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి వసతి కల్పించారు. గ్రామంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఈ శిక్షణ నివేదికను కలెక్టర్‌తోపాటు శిక్షణ కేంద్రంలో అందజేస్తాం. గ్రామస్తుల ప్రేమ, ఆప్యాయతలు మరువలేనివి.

– ఛాయా, ట్రైనీఅధికారిణి

పొనకల్ చెరువు హద్దుల గుర్తింపు

జన్నారం: మండలంలోని పొనకల్ ఊరచెరువు కబ్జాకు గురైనట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం డీఐవో గంగాధర్ ఆధ్వర్యంలో చెరువు విస్తీర్ణం గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 400లో 41.20 ఎకరాల భూమి ఉండగా అందులో కొంత కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో వేణు వచ్చి చెరువును పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల ప్రకారం డీఐవో గంగాధర్, తహసీల్దార్ వెంకటకిషన్, ఆర్ఐ భాను చందర్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ హద్దులు నిర్ణయించారు. కొంత భూమిని ఆక్రమించేందుకు యత్నించగా అక్కడి వరకు హద్దులు ఏర్పాటు చేశారు. శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, స్థానికులు కోరుతున్నారు.



చెరువు హద్దులను గుర్తిస్తున్న డీఐవో

ఒకే వేదికపై కవలల కల్యాణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వారిద్దరూ కవల సోదరులు.. కలిసి పెరిగారు.. కలిసి చదివారు.. ఒకే కంపెనీలో ఒకే రకమైన ఉద్యోగం చేస్తున్నారు. ఒకే వేదికపై కల్యాణంతో శుక్రవారం ఓ ఇంటివారయ్యారు. మంచిర్యాలకు చెందిన బోడకుంట ప్రభ, మల్లయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో సంతానంగా కవలలు అనిల్, సునీల్ జన్మించారు. పదో తరగతి వరకు ఒకే చోట చదివినా.. పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ వివిధ కళాశాలల్లో చదివారు. జార్ఖండ్ రాష్ట్రం బొకారాలోని కోలిండియా కంపెనీలో ఒకేచోట అసిస్టెంట్ మేనేజర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని పద్మావతి గార్డెన్స్‌లో 15నిమిషాల తేడాతో అనిల్ వివాహం రాపల్లికి చెందిన అనూషతో, సునీల్ వివాహం సోమగూడెంకు చెందిన ఉషామణితో జరిగింది.



వివాహ వేడుకలో కవల సోదరులు, వధువులు

వేతనాలు పెంచాలని ఓబీ కార్మికుల ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): వేతనాలు పెంచాలని బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగూడ ఓసీపీలో ఓబీ పనులు చేస్తున్న కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి సమ్మె బాట పట్టగా శుక్రవారం కార్మికులంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మిక చట్టాలకు అనుగుణంగా వేతనాలు అందించడం లేదని, ప్రస్తుతం 26 మస్టర్లకు రూ.18,050 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కోల్ ఇండియాలోని బొగ్గు గనుల్లో ఓబీ కార్మికులకు ఇస్తున్న తరహాలో తమకూ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వేతనానికి అదనంగా మరో రూ.3వేలు పెంచితే విధులకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్మికుల పక్షాన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఓబీ కాంట్రాక్ట్ సంస్థతో సంప్రదింపులు జరిపినా ఎలాంటి స్పష్టత రాకపోగా కార్మికులు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. అలాగే గోదావరిఖని, రామగుండం ఏరియాలో పని చేస్తున్న ఓబీ కార్మికులకు పెంచినట్లుగా తమకూ పెంచాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కొండపల్లికి చెందిన గద్దెలపల్లి సాయికుమార్ (27) మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై భూమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. మూడు నెలల క్రితం పని మానేసి కొండపల్లికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఎవరితోనూ మాట్లాడకుండా తనలో తానే బాధపడుతూ మానసికంగా కుంగిపోయేవాడు. తల్లిదండ్రులు నచ్చజెప్పినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈక్రమంలో గురువారం తల్లిదండ్రులు బంధువు వివాహానికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తన తండ్రికి ఫోన్ చేసిన సాయికుమార్ ఇంటికి ఎప్పుడు వస్తున్నారని అడిగి తెలుసుకుని ఫోన్‌కట్ చేశాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి పైకప్పు ఇనుప పైపునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న రామకృష్ణ



కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ

జైపూర్: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023 జనవరిలో ఇన్వెస్టిగేషన్, ఎస్‌హెచ్‌వో వర్టికల్స్ కేటగిరీ త్రీలో ప్రథమ స్థానం వచ్చినందుకు నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో సీపీ రెమారాజేశ్వరి చేతుల మీదుగా జైపూర్ ఎస్సై రామకృష్ణ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జైపూర్ పోలీస్‌స్టేషన్‌లోని స్టేషన్‌రైటర్, వర్టికల్స్, వారెంట్ వర్టికల్స్‌లోనూ ఉత్తమంగా పోలీస్‌స్టేషన్‌ను నిలిపినందుకు కానిస్టేబుళ్ల సురేశ్, భాస్కర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం వర్టికల్స్‌లో ఉత్తమంగా ఎంపికయ్యేలా కృషి చేసిన జైపూర్ ఎస్సై రామకృష్ణ, సిబ్బందిని మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు, ఉన్నతాధికారులు అభినందించారు.

దేవాపూర్ కానిస్టేబుళ్లకు అవార్డులు

కాసిపేట: దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎండీ షఫీ, జీ శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనబర్చినందున సీపీ రెమారాజేశ్వరి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పోలీస్‌స్టేషన్ రైటర్, వర్టికల్స్ బ్లూకోల్ట్స్ వర్టికల్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందున పురస్కారం అందించినట్లు తెలిపారు. సీపీ చేతులమీదుగా అవార్డులు అందుకున్న వీరిని ఎస్సై విజయేందర్, తోటి సిబ్బంది అభినందించారు.

నెలాఖరులోగా సీపీఆర్ఎంఎస్ సభ్యత్వం తీసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో అర్హులైన వారు ఈ నెలాఖరులోగా సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ సభ్యత్వం తీసుకునేందుకు యాజమాన్యం చివరి అవకాశం కల్పించిందని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో వేజ్‌బోర్డ్ తర్వాత సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ సభ్యత్వం కోసం రూ.40 వేలు చెల్లించినవారు, ఇదివరకే ఎంతో కొంత సభ్యత్వ రుసుం రికవరీ అయినవారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి విరాలకు ఏరియాలోని గని సంక్షేమాధికారిని సంప్రదించాలని సూచించారు.

నీట్‌లో ర్యాంక్ రాదేమోనని విద్యార్థిని ఆత్మహత్య



వైష్ణవి మృతదేహం

రామకృష్ణాపూర్: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్దె రాగిడి ఆర్ఆర్‌నగర్‌లో ఉంటున్న గూడెపు వైష్ణవి (17) మందమర్రిలోని ఎస్ఎంజేసీ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. క్లాస్‌లో టాపర్‌గా ఉండే వైష్ణవి కొద్దిరోజులుగా ఆన్‌లైన్‌లోనే క్లాసులు వింటూనే నీట్‌కు ప్రిపేరవుతోంది. రెండేళ్లుగా ఒంటరిగా ఉంటూ నీట్ ర్యాంక్ గురించే ఎక్కువగా ఆలోచించేదని, ఈ క్రమంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు తెలిపారు. తండ్రి కామేశ్వర్‌రావు రిటైర్డ్ హెచ్‌ఎం కాగా, సోదరుడు ఎయిరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సజీవ దహనం కేసులో బెయిల్ పిటిషన్ కొట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గుడిపెల్లిలో గత డిసెంబర్ 16న జరిగిన సజీవదహనం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌ను ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ ఘటనలో మేడి లక్ష్మణ్, శనిగారపు సృజన, శ్రీరాముల రమేష్, వేల్పుల సమ్మయ్య, అర్నకొండ అంజయ్యలపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపర్చడం, రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. వీరిలో ఏ–1 లక్ష్మణ్, ఏ–3 శ్రీరాముల రమేష్, ఏ–4 వేల్పుల సమ్మయ్యలను డిసెంబర్ 23న పోలీసులు వారం రోజుల పోలీసు కస్టడీకి కోరగా ఆరు రోజులు 25నుంచి 30వరకు అనుమతి ఇచ్చారు. కాగా, శుక్రవారం నిందితుల తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

వేసవిలో పశువులు, జీవాలు పదిలం



చెన్నూర్‌రూరల్: మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఏప్రిల్, మేలో మరింత ముదరనున్నాయి. ఇప్పటికే పశువులు, జీవాలు అల్లాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.90లక్షల పశువులు ఉండగా, ఇందులో తెల్లజాతి (ఆవులు, ఎద్దులు) 1.80లక్షలు, గేదెలు 1.10లక్షలున్నాయి. గొర్రెలు 5.50లక్షలు, మేకలు 2లక్షలున్నాయి. ఈ క్రమంలో వీటిని ఎండవేడిమి నుంచి సంరక్షించుకునేందుకు పశుపోషకులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కత్తెరసాల పశువైద్యాధికారి శ్రీనివాస్ ఇలా వివరించారు.

- పశువులకు వేసవిలో మేత, దాణా సరిపడా అందించాలి.
- పచ్చిమేత దొరకకుంటే ఎండుమేతతోపాటు ఎక్కువగా దాణా ఇవ్వాలి.
- శుభ్రమైన చల్లనినీరు లభించేలా చూడాలి.
- కొట్టాల వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే కొట్టాలపై గడ్డి కప్పి ఉంచాలి. కొట్టాల చుట్టూ తడకలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపై కూడా రెండు, మూడుసార్లు నీళ్లు చల్లితే మంచిది.
- గేదెలను చెరువులకు పంపి మధ్యాహ్నం కొంతసేపు అందులో ఉండనివ్వాలి. సాయంత్రం పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడగాలి.
- వేసవిలో గొర్రెలు, మేకల్ని జత కలిపి చూడి కట్టించాలి.
- మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరు చేయాలి.
- పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి.
- గొర్రెలు, మేకలు, ముఖ్యంగా పిల్లలకు వడగాడ్పులు తగలకుండా చూడాలి.
- మధ్యాహ్నం మేతకు బయటకు తీసుకువెళ్ల వద్దు.
- బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగు నీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి.



శ్రీనివాస్, పశువైద్యుడు